15062024-DIS-04_Layout 1 6/15/2024 2:12 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

బ్లేమ్ గేమ్ బూమరాంగ్ అవడం ఖాయం

డాక్టర్ ఆంజనేయ గౌడ్

చరిత్రను అర్థం చేసుకోగలిగితే ఏ రంగంలోని వారికైనా చూపుడు వేలుగా మారుతుంది. మరీ ముఖ్యంగా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, నేతలకు పరిపక్వతతో పాటు, శాస్త్రీయ పాలనా విధానాల అవగాహనకు కూడా దోహదపడుతుంది. కానీ, దురదృష్టవశాత్తు గాలికి ఎగిరొచ్చి తలపై వాలిన కిరీటం కొందరిని కిందకు చూడనివ్వదు. వాస్తవానికి ఆరోపణలు, ప్రత్యారోపణలు ప్రజా రాశుల మదిలో ఆరాధనా భావన కలిగిన నేతల వ్యక్తిత్వ హనన యత్నాలు రాజకీయాలలో కొత్త వ్యూహాలేం కావు.

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశ రాజకీయ చరిత్రలో చాలామంది ప్రముఖ నాయకులపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. వారిలో కొందరు ముఖ్యుల మీద మోపిన నిందలపై విచారణలు సైతం జరిగాయి. నెహ్రూ ప్రభుత్వం తీసుకొచ్చిన 1952 విచారణ కమిషన్ల చట్టం మేరకు ఇందిరాగాంధీపై కూడా విచారణ జరిగింది. అయితే వివిధ కమిషన్ల విచారణ తీరు, వాటి నియామకం వెనుక ఆయా ప్రభుత్వాధినేతల ఉద్దేశాల నిరూపణ లక్ష్యం పరిధిని ధాటి, చట్టం స్ఫూర్తిని ప్రదర్శించే దిశగా సాగలేదని అధ్యయనం చేస్తే ఎవరికైనా అర్థమవుతుంది.

నిందారోపణలు, కమిషన్‌లు, విచారణలు విలువైన నాయకత్వాల ప్రతిష్టను వధిస్తాయని ఏ పాలకుడైనా భ్రమపడితే అవివేకమే అవుతుందని గతం మనకు చెప్తున్నది. కానీ, గతంలోకి తొంగిచూసి, వర్తమానం విలువను అర్థం చేసుకొని, భవిష్యత్తులో కూడా ఉపయోగంలో ఉండే వ్యక్తిత్వం అందరు నాయకులకు ఉంటుందని ఆశించలేం కదా! అందులోనూ రాజకీయ అబ్రకదబ్ర విద్యను మాత్రమే విశ్వసించే సీఎం రేవంత్ నుంచి ఆ పరిణతి కోరుకోవడం విడ్డూరమే అవుతుంది. వాస్తవానికి ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందు పెద్ద సవాల్ ఉన్నది. ఏం చేసినా తెలంగాణ చరిత్రలో కేసీఆర్ నమోదు చేసుకున్న అద్భుత స్థానాన్ని అందుకోవటానికి ఆస్కారం లేనే లేదు. అలాగే పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనా విధానాలకు పది పైసలు జోడించే వెసులుబాటు ఉంది కానీ, భిన్నమైన పథకాలతో నూతన చరిత్రను లిఖించే అవకాశం హస్తం పార్టీ ప్రభుత్వానికి కనిపించడం లేదు. దీంతో రేవంత్ రెడ్డి కూడా పాత రోత నీతినే నమ్ముకున్నారు. ఆ ఆలోచనల్లో భాగంగానే నీళ్లలో నేరం నమోదు చేసేందుకు, కరెంట్ వెలుగులపై అవాస్తవాలను ఆరేసేందుకు కుట్రాచారం ఆచరణలో పెడుతున్నారు.

చరిత్ర నిర్మించే చేవ లేనప్పుడు, చారిత్రక పురుషుల కార్యాలను వెక్కిరింతల పాల్జేయాలనే విషపు ఎత్తుగడ కొత్తదేం కాదు. శకుని మామ వారసులు ఎందరో ఆ విద్యను ఆచరణలో పెట్టారు. ఆ రాతియుగపు వికృత వ్యూహమైన విజేత విలువను వధిస్తే, కనీసం దింపుకొని, వీరులను తమ వరుసలోనే కూర్చోబెట్టుకోవచ్చుననే దుర్బుద్ధి కొందరు విఫల పాలకులకు ఉండింది. అదే ధోరణిని నేడు రాష్ట్ర సర్కార్ పెద్దలు ప్రదర్శిస్తున్నారు. కానీ, బ్లేమ్ గేమ్ బూమరాంగ్ కావడమన్నది దేశ రాజకీయాల్లో చారిత్రక సత్యమే కదా! కాళేశ్వరంపై, కరెంట్‌పై, గొర్రెల పంపిణీ పథకంపై ఇంకా ఎన్ని కమిషన్‌లు వేసే యోచన రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఉన్నదో తెలియదు గానీ, అన్నీ విఫల యత్నాలై, తెలంగాణ చరిత్రే విజయం సాధించడం ఖాయం. అసాధ్యమని దేశమే నమ్మిన ప్రత్యేక రాష్ట్రాన్ని జనం అనుభవంలోకి తెచ్చిన, అద్వితీయ పాలనా విజయాలను పదేండ్లలో ప్రజలకు పంచిన కేసీఆర్‌ను పలుచన చేయాలనే పాచికలు పారవు.

పాలకుల కంటే ప్రకృతి గొప్పది. శ్రమకు తలవంపులు తెచ్చే ఏ చర్యనూ పంచభూతాలు అంగీకరించవు. శ్రమను శ్రమతోనే జయించగలరు గానీ దాని దివ్యత్వాన్ని ఏ ఎత్తులతోనో మలినపరచడం అసాధ్యం. తెలిసో, తెలియకో, కుట్ర కల్పించిన వక్రత్వం ఆవహించిన పరవశంలోనో రేవంత్‌రెడ్డి లాంటి పాలకులు శ్రమకు పంగనామాలు పెట్టే పని ముందేసుకుంటారు. వివక్ష, వంచనకు తరాలకు తరాలు వేలాడిన తెలంగాణను, త్వరితగతిన ఒడ్డున పడేసే సత్సంకల్పంతో సాగిన కేసీఆర్ ప్రభుత్వ పనులపై ఉద్దేశపూర్వక వికృత లక్ష్యంతో విచారణాపర్వం నడిపించడం వివేకమవుతుందా?

అసలు కేసీఆర్ సర్కార్‌పై మోపిన అత్తెసరు ఆరోపణలపైనే కాదు, దేశంలో మహా నేరారోపణలపై నడిచిన కమిషన్ విచారణలు కూడా న్యాయ పరీక్ష ముందు ఓడిపోయాయి.

1971-76 మధ్యకాలంలో నాటి తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి అక్రమాలకు పాల్పడ్డారని ఎంజీఆర్ తదితర నేతలు చేసిన ఫిర్యాదులపై ఎమర్జెన్సీ సమయంలోనే రంజిత్ సింగ్ సర్కారియా కమిషన్ విచారణ చేపట్టింది. అలాగే ఎమర్జెన్సీ సమయంలో ఇంధిరాగాంధీ సర్కార్ అనేక అకృత్యాలకు పాల్పడిందనే ఆరోపణలపై సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జయంతిలాల్ ఛోటాలాల్ షా కమిషన్‌ను నాటి జనతా సర్కార్ నియమించి, విచారణ జరిపింది. రాజ్యాంగ ఉల్లంఘనలు, అక్రమ అరెస్టులు, అవినీతి, హత్యలు తదితర తీవ్ర నేరారోపణలపై పాటియాల హౌస్‌లో జరిగిన షా కమిషన్ విచారణతో పాటు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో వందలాది కేసులు మాజీ ప్రధాని ఇందిరాగాంధీపై నమోదయ్యాయి. చివరికి ఈశాన్య రాష్ట్రాలలో ఆ సమయంలో జరిగిన కోళ్ల దొంగతనం కేసు కూడా మాజీ ప్రధానమంత్రిపై నమోదైంది. షా కమిషన్ విచారణే కాదు, దేశంలోని అనేక న్యాయస్థానాల్లో జరిగిన విచారణను ఇందిరాగాంధీ ఎదుర్కొన్నారు. ఆ పరిణామాలన్నీ ఆమెపై సానుభూతిని పెంచి, ఆరాధనాభావం మళ్లీ పెరగడానికి దారితీశాయి. జస్టిస్ షా కమిషన్ విచారణ సందర్భంగా ఇందిరాగాంధీ స్వయంగా కోర్టుకు ఇలా చెప్పుకొచ్చారు. 'కొన్ని సదుద్దేశ ప్రభుత్వ విధానాలు కొన్ని సందర్భాల్లో వివాదాస్పదం కూడా కావొచ్చు. కానీ, వాటిని తదుపరి ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలకు వినియోగిస్తే ఆ తర్వాతి కాలంలో వచ్చే ప్రభుత్వాలు అసలు విధాన నిర్ణయాలు తీసుకోవటానికే జడుసుకుంటాయి. రాబోయే ప్రభుత్వాలు రంధ్రాన్వేషణ చేసి, విచారణ జరిపించగలవనే భయం ఏ ప్రభుత్వ విప్లవాత్మకమైన ఆలోచనలనైనా పురిట్లోనే చంపేస్తుంది' అని ఇందిరాగాంధీ తన తరపున తానే వాదనలు వినిపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరాగాంధీపైనే కాదు, దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీపై వచ్చిన బోఫోర్స్ కుంభకోణం ఆరోపణలు అనేక సంవత్సరాల పాటు దేశ రాజకీయ రంగంలో తీవ్ర చర్చను రగిలించింది. అలాగే పీవీ నరసింహారావుపై వచ్చిన హర్షద్ మెహతా స్టాక్ ఎక్స్ఛేంజీ స్కాం, జేఎంఎం ముడుపుల కేసు విచారణతో పాటు బాబ్రీ మసీదు కూల్చివేత కుట్రకూ సహకరించారన్న ఆరోపణలు అప్పట్లో భగ్గుమన్నాయి. వాటన్నింటిపై జరిగిన విచారణలు దేశంలో నాడు అనేక అంశాలను చర్చకు పెట్టాయి. ఈ వివాదాలన్నింటిపై 'అయోధ్య 6 డిసెంబర్ 1992' అనే తన స్వీయ రచనలో విషాదానికి ఒక వ్యక్తిని బాధ్యుడిగా చూపిస్తున్న వారే.. ఒకవేళ విజయం సాధించి ఉంటే ఘనతను దక్కించుకునేందుకు వెంపర్లాడేవాళ్లు అంటూ సొంత పార్టీ నేతల వ్యక్తిత్వం గురించి పీవీ విమర్శించారు. నిజమే విజయాలను అనుభవించేందుకు, ఘనకీర్తికి బాధ్యత వహించేందుకు ఉబలాటపడే వైయక్తిక సమూహమైనా, సమాజమైనా ఊహించని విషాదానికి ఏ ఒక్కరినో బలి పశువును చేయడానికి ఏ మాత్రం సంకోచించరు. ఈ వింత ధోరణికి రాష్ట్ర ప్రస్తుత సర్కార్ నిలువుటద్దం.

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ వ్యవసాయ సదస్సులో మంత్రులు తుమ్మల, భట్టి, ఉత్తమ్ తదితరులు ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ ఛాంపియన్ అని కొనియాడారు. ఇతర వ్యవసాయ, సాగునీటి రంగాల విజయాలను ఘనంగా చాటి చెప్పుకొన్నారు. అలాగే రాష్ట్ర ఐటీ ఎగుమతులు, పెట్టుబడులకు గల అవకాశాలు తదితర తెలంగాణ ఘనతల గురించి ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అమెరికాలో అద్భుతంగా ఆవిష్కరించారు. మరి ఈ విజయతీరాలను తెలంగాణ చేరుకోవడం వెనుక కేసీఆర్ ప్రభుత్వం పడ్డ కష్టాన్ని మాత్రం గుర్తించరెందుకు? కేసీఆరే కాదు, ఏ పాలకుడూ ఊహించని సంఘటన కాళేశ్వరంలో జరగగానే.. రాష్ట్రాన్ని ధాన్యాగారంగా తీర్చిదిద్దిన కేసీఆర్‌ను శిలువకు వేలాడదీసేందుకు పోటీ పడుతున్నారు. ఈ మానసిక స్థితి పాలకులకు ఏ విధంగానూ శోభనివ్వదు.

పైన పేర్కొన్న కరుణానిధి, ఇందిర, రాజీవ్, పీవీలతో పాటు అనేకమంది ప్రముఖ నాయకులపై ఆరోపణలు వచ్చాయి. వాటిపై విచారణలూ జరిపించారు. దేశ మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీపై హవాలా స్కాం, మాజీ రక్షణశాఖ మంత్రి జార్జ్ ఫెర్నాండెజ్‌పై కార్గిల్ శవ పేటికల కుంభకోణం ఆ కోవలోనివే. అందుకు నేటి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాలపై గోద్రా సంఘటనానంతర అల్లర్లను ప్రోత్సహించారనే ఆరోపణలపై కూడా కమిషన్ విచారణలు జరిగాయి. ఇప్పటి కేంద్ర, రాష్ట్ర సర్కార్‌లపై కూడా అనేక అవినీతి అరోపణలు చర్చలో ఉన్నాయి. అయినా ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, కరుణానిధి, అద్వానీ, పీవీ తదితర మేరునగధీరులైన చారిత్రక నేతల ఔన్నత్యాన్ని కమిషన్‌లు, విచారణలు తగ్గించగలిగాయా? ఆ మాట కొస్తే దేశంలో మాజీ ప్రధానమంత్రులపై వచ్చిన ఆరోపణలలో కేసీఆర్‌పై వచ్చినవి ఏపాటివని? ఇలా రాజకీయ వ్యవస్థలో దుర్మార్గకర ధోరణి బలపడుతూ, దేశంపై పట్టుకూ అదే అన్యాయమైన పావులు కదుపుతున్నారు. జాగ్రత్తగా పరిశీలిస్తే.. దేశ రాజకీయాల్లో రాష్ట్రాల అస్తిత్వ, ఆత్మగౌరవ రాజకీయాలను పాతరేయాలనే జాతీయపార్టీల వ్యూహాలు కూడా మనకేం భిన్నంగా గోచరించవు. నేతల వ్యక్తిత్వాల హననంతో ప్రాంతీయ పార్టీల పీక నొక్కి వేయాలనే ప్రణాళికలు 1980ల తర్వాత దేశ రాజధాని కేంద్రంగా అమలవుతున్నవే కదా! సాధ్యపడితే ఆయా రాష్ట్రాల్లో తమ పార్టీ ప్రభుత్వాలతో, లేకపోతే ఢిల్లీ పెద్దల ఎత్తుగడలతో ఆత్మగౌరవ, అస్తిత్వ రాజకీయ భావజాలాల వధకు వేగంగా పావులు కదుపుతూనే ఉన్నారు.

డీఎంకే, అన్నాడీఎంకే, శివసేన, ఎన్సీపీ, బీఆర్ఎస్ ఇలా బలమైన ప్రాంతీయ రాజకీయ నాయకత్వాల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ పొలిటికల్ హంట్‌ను హస్తం, కమలం పార్టీ ప్రభుత్వాలు అమలుపరుస్తూనే ఉన్నాయి. దీనివెనుక రెండు జాతీయపార్టీల విస్తరణ ఉన్మాదమే కాదు, దేశ సహజ వనరులను కొల్లగొట్టేస్తున్న బహుళజాతి కంపెనీల హస్తం కూడా ఉన్నది. ఆయా రాష్ట్రాల సహజ వనరుల రక్షణ, ఆత్మగౌరవం, అభివృద్ధి మాత్రమే లక్ష్యంగా కలిగిన ప్రాంతీయ పార్టీలు మనుగడలో ఉం టే వాటిని సొమ్ము చేసుకోవడం అంత సులభంగా జరిగే పని కాదని ఆ రెండు జాతీయపార్టీల సావుకారు దోస్తులకు బాగా తెలుసు. అందుకే వారి వెనుక ఉండి వీలైతే బ్లేమ్ గేమ్‌తో, కాకపోతే చీల్చే స్కాంతో ప్రాం తీయ రాజకీయ శక్తులను నిర్వీర్యం చేసే కుయుక్తులు పన్నుతున్నారు.

ప్రాంతీయ పార్టీలను ఒకడు కొడితే మరొకడు ఓదార్చే క్రీడతో వంతుల వారీగా ఏమారుస్తున్నారు. కానీ, కాంగ్రెస్, బీజేపీలు కుట్రలతో ఏ ఆత్మగౌరవ రాజకీయ శక్తిని కూడా నిర్మూలించలేకపోయారని చరిత్ర మనకు గుర్తుచేస్తున్నది. అవినీతి ఆరోపణాస్త్రాలతోనో, అణచివేత విధానాలతోనో, తాయిలాల గాలాలతోనో ప్రాంతీయ ఆకాంక్షలను దేశ రాజకీయ పెత్తందారులు సమాధి చేయలేకపోయారు. ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ డీఎంకే, శివసేన, ఎన్సీపీ, ఆర్జేడీ, ఎస్పీ, ఎల్జేపీ తదితర ప్రాంతీయ రాజకీయ శక్తులు తమ పూర్వ వైభవాన్ని తిరిగి దక్కించుకున్నా యి. బీఆర్ఎస్ కూడా తెలంగాణ నేలతల్లి కన్న బిడ్డ. రాష్ట్రం ఎంత వాస్తవమో గులాబీ జెండా కూడా అంతే శాశ్వతం.

నిజానికి తెలంగాణ ఆవిర్భావం నాటికి పలువురు పాపాల భైరవుల చిట్టా కండ్లముందే ఉన్నది. ఐఎంజీ భూముల స్కాం, ఇందిరమ్మ ఇండ్ల కుంభకోణం, ప్రాజెక్టుల అడ్వాన్స్ మొబిలైజేషన్ల గోల్‌మాల్, ఫేక్ ఎన్‌కౌంటర్లు ఇలా ఎన్నో అక్రమాల సమాచారం నాటి తెలంగాణ ప్రభుత్వం దగ్గర ఉన్నది. కేసీఆర్ ప్రభుత్వం కూడా కాంగ్రెస్ పార్టీ సర్కార్‌లా ఆలోచించి ఉంటే ఎందరో సుద్దపూసలు ఊచలు లెక్కబెట్టేవారు. కానీ, గత ప్రభుత్వాల విధానాలపై రంధ్రాన్వేషణ కోసం ఒక్క సెకన్ సమయం కూడా కేసీఆర్ సర్కార్ వృథా చేయలేదు. ప్రతి నిమిషం తెలంగాణ ప్రగతి కోసమే వెచ్చించి చెమటోడ్చింది. దానివల్లనే స్వరాష్ట్రం విఫల రాష్ట్రంగా మారుతుందని ఆశించిన వారి కండ్లు బైర్లు కమ్మేలా అద్వితీయమైన విజయాలకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ ఎదిగింది.

మానసిక మరుగుజ్జుల ఉచ్చు నుంచి బయటపడ్డ తెలంగాణ.. విజ్ఞుడి ఏలుబడిలో నిలబడి గెలిచింది. అలాంటి తెలంగాణను పగలకు, విలువల్లేని విధానాలకు నిలయంగా కాంగ్రెస్ ప్రభుత్వం మార్చేసే ప్రయత్నం చేస్తున్నది. కేసీఆర్ ప్రతిష్టను తగ్గించే పనిలో తెలంగాణ చరిత్ర చేతులు విరగ్గొట్టే విధానాలు అమలుచేయడం న్యాయమా? రైతులు, బడుగుల భవిష్యత్తు కోసం కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన ప్రతి పథకానికి మలినం పూసే పద్ధతి చివరికి ప్రజలకు భారీ నష్టం చేస్తుంది.

విచిత్రమేమంటే చివరికి లక్షల మంది అట్టడుగు వర్గాల పిల్లలకు భద్రమైన భవితను వాగ్దానం చేసిన గురుకులాలనూ నిర్వీర్యం చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతుండటం ఆవేదనాభరితం. గురుకులాల వసతి గృహ విద్య తల్లిదండ్రులతో అనుబంధాన్ని చంపేస్తున్నదని స్వయానా సీఎం సెలవివ్వడం ఎంతటి దుర్మార్గం? కనీసం గురుకుల విద్యావ్యవస్థ చరిత్రను తెలుసుకోకుండా బోధి వృక్షాల్లాంటి వాటిని సైతం నేలమట్టం చేసే దిశగా కాంగ్రెస్ సర్కార్ అడుగులు పడుతున్నాయి.

విచారణలు, కమిషన్‌లు, చర్యలు, ప్రభుత్వ వైఫల్యాలే మళ్లీ బీఆర్ఎస్ పార్టీకి ఘన విజయాన్ని కట్టబెడతాయి. రేవంత్‌రెడ్డి సర్కార్‌తో పాటు దేశం, రాష్ట్రంలో బీజేపీ వేగంగా ప్రజా విశ్వాసాన్ని కోల్పోవడం ఖాయం. ప్రభావిత సమాజం ఆసరాగా రాకపోతే మౌత్ టూ మౌత్ క్యాంపెయిన్‌ను నమ్ముకొని అమెరికా అధ్యక్షుడిగా నెగ్గిన అబ్రహాం లింకన్ పంథాను గులాబీ దళం సభ్యులైన మనం ఇప్పుడు అనుసరించాలి. మెజారిటీ మీడియా, రాజకీయ పెత్తందా రీవర్గ మేనియా ఎటువైపున్నదో తేటతెల్లమైంది. కార్యకర్తలమే కార్యశీలురమై రాష్ట్ర ఆత్మగౌరవ పరిరక్షణ పోరును ఊరూరా మండిద్దాం. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వానికి ఇరిగేషన్ సలహాదారే కాదు, హస్తం ఇండ్లు నడిపిస్తున్నదీ ఎవరో బుద్ధిజీవులందరికీ తెలిసిన సత్యమే. తెలంగాణకు గులాబీ జెండా శాశ్వత అవసరం. ఆ వెలుగులోనే 'ఎత్తిన జెండా దించమోయ్.. గులాబీ జెండాకు జై' అంటూ నినదిద్దాం. సూర్యుడిని మబ్బులతో దాచేయాలనుకోవడం ఎంత అవివేకమో, చారిత్రక నేతలను ప్రజల్లో పలుచన చేయలనుకోవడం కూడా అంతే అజ్ఞానం. మళ్లీ జనం జైత్రయాత్రగా బీఆర్ఎస్ ప్రభంజనం ఖాయం.

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్‌అథారిటీ మాజీ చైర్మన్)

గురుకులాల అస్తిత్వాన్ని కాపాడాలె

గురుకులాల కారణంగా మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయని ఒక అధ్యయనంలో వెల్లడైందని, దీనిపై మరింత లోతుగా విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల పేర్కొన్నారు. రాష్ట్రంలోని సర్కార్ పాఠశాలలను సెమీ గురుకులాలుగా మార్చే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్టు కూడా తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను సెమీ గురుకులాలుగా మార్చాలనుకోవడం హర్షణీయమే. కానీ, ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కళాశాలల అస్తిత్వాన్ని కూడా కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉన్నదన్న విషయాన్ని మరువకూడదు.

సీవీవీ ప్రసాద్
80196 08475

సాధారణంగా గురుకులాలలో ఐదో తరగతి పిల్లలను చేర్పిస్తారు. ఆ సమయంలో వారికి కనీసం పదేండ్ల వయస్సు ఉంటుంది. అప్పటివరకు పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలో, వారి సంరక్షణలోనే పెరుగుతారు. పదేండ్ల వరకు తల్లిదండ్రులే పిల్లల ఆలనాపాలనా చూసుకుంటారు. అదీ కాకుండా గురుకులాలలో చేర్పిన తర్వాత ఆదివారాలు, సెలవు రోజుల్లో తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి వస్తుంటారు. ఐదో తరగతి నుంచి ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు విద్యా బుద్ధులు నేర్చుకుంటారు. ఆ సమయంలో చదువుతో పాటు మంచిచెడుల గురించి కూడా ఉపాధ్యాయులు బోధిస్తారు. అందువల్ల గురుకులాలలో ఉంటే మానవ సంబంధాలు బలహీనపడతాయని చెప్పడం సరికాదు.

చదువుకునే వయసు రాగానే పూర్వం రాజులు కూడా తమ పిల్లలను గురుకులాలకు పంపించేవారు. యుక్త వయసు వచ్చేవరకు అక్కడే ఉంటూ వారు సకల శాస్త్రాలు నేర్చుకునేవారు. యుద్ధ తంత్రాలను ఒంట బట్టించుకునేవారు. అన్నిరంగాల్లో ప్రావీణ్యం సాధించి యువరాజులుగా పట్టాభిషిక్తులై రాజ్యాలను పరిపాలించేవారు. విద్యార్థికి చదువు రావాలంటే ఏకాగ్రత ముఖ్యం. ఇంట్లోని సమస్యలు చదువుకు ఆటంకం కారాదు. గ్రామాల్లోని అనేక ఇండ్లల్లో చదివే వాతావరణం కనిపించదు. మరీ ముఖ్యంగా మద్యం కారణంగా కొంతమంది భార్యాభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతుంటాయి. సింగిల్ పేరెంట్స్ చదివించే స్థితిలో లేకపోవడం, పాఠశాలల నుంచి తిరిగొచ్చాక పిల్లలతో ఇంటి పనులు చేయించడం, కొంతమంది పిల్లలు తల్లిదండ్రుల మాట లెక్కచేయకుండా టీవీలు, ఫోన్లకు అతుక్కుపోవడాన్ని మనం చూస్తూనే ఉన్నాం. అటువంటి వాతావరణంలో పిల్లలు చదువుకోవడానికి కుదరదు.

గురుకులాల వాతావరణం అందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తారు. టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పిల్లలను చదివిస్తారు. అందుకే గురుకులాలలో చదివిన ఎంతో మంది నేడు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా, డాక్టర్లు, ఇంజినీర్లుగా ఉన్నత స్థానాలకు చేరుకొని సమాజ సేవ చేస్తున్నారు. సర్కార్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గురుకులాలే కారణమని కొంతమంది అసంబద్ధంగా వాదిస్తుంటారు. ఆ వాదన సరికాదు. అందుకు ప్రైవేట్ పాఠశాలలే కారణం. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉన్నట్టుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడం, టీచర్ల సంఖ్య తక్కువగా ఉండటం, సరైన పర్యవేక్షణ లేకపోవడమే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు చూడకపోవడానికి ప్రధాన కారణం.

రాష్ట్రంలో 1200కు పైగా గురుకులాలున్నాయి. వాటిలో సుమారు 4 లక్షల మందికి పైగా విద్యార్థులు చదవుకుంటున్నారు. 10వ తరగతి, ఇంటర్‌లలో గురుకుల విద్యార్థులే రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నారంటేనే వాటి ప్రమాణాలను అర్థం చేసుకోవచ్చు. గురుకులాలలో సీట్లకున్న డిమాండే అందుకు నిదర్శనం. జాతీయస్థాయి పోటీ పరీక్షలు జేఈఈ, నీట్‌లలోనూ గురుకులాల విద్యార్థులే అగ్రస్థానంలో నిలుస్తున్నారు. కేవలం విద్యలోనే కాకుండా క్రీడలు, పర్వతారోహణ వంటి అతి క్లిష్టమైన వాటిల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. గురుకులాల విజయాలను స్ఫూర్తిగా తీసుకొనే దేశంలో నవోదయ విద్యాలయాలను నెలకొల్పారన్నది జగమెరిగిన సత్యం.

ఇప్పటికీ కొన్ని గురుకులాలను సమస్యలు వెంటాడుతున్నాయి. వాటిలో బోధనా సిబ్బంది తక్కువగా ఉన్నారు. ప్రధానోపాధ్యాయులు, పర్యవేక్షణాధికారుల కొరత ఉన్నది. గురుకులాలను తీసివేయాలనే ఆలోచనను ప్రభుత్వం మచ్చుకైనా రానీయకూడదు. పోగా వాటిలో మౌలిక వసతులను కల్పించాలి. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి. అంతేకాదు, గురుకులాలను పూర్తిస్థాయి కళాశాలలుగా మార్చాలి. గురుకులాలను మరింత బలోపేతం చేసి వాటి అస్తిత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలి.

లేఖ

ఢిల్లీలో సామాజికం.. గల్లీలో భూస్వామికం

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజ్యాంగ రక్షణ, సామాజిక న్యాయం, కులగణన అంశాలే కాంగ్రెస్‌కు ఊపిరిపోశాయి. అయితే సామాజిక న్యాయం అంటూ జాతీయ కాంగ్రెస్ నినదిస్తుంటే.. తెలంగాణలోని కాంగ్రెస్ నాయకత్వం మాత్రం భిన్న వైఖరిని అవలంబిస్తున్నది. సామాజిక తెలంగాణ, ప్రజా పాలన పేరిట గద్దెనెక్కిన కాంగ్రెస్ ఆ నినాదాలకు తిలోదకాలిచ్చింది. ముఖ్యమంత్రి తమ సామాజికవర్గానికి చెందినవారికి ఎక్కువ పదవులు కట్టబెట్టడమే సామాజిక న్యాయం అనేటట్టుగా వ్యవహరిస్తున్నారు.

గెలుపు గుర్రాల పేరిట అసెంబ్లీ ఎన్నికల్లో అగ్రకులాలకే పట్టం గట్టిన కాంగ్రెస్ పార్టీ.. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలు, నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లోనూ అదే ధోరణిని కొనసాగించింది. సామాజిక న్యాయాన్ని పూర్తిగా విస్మరించి బీసీలను కేవలం ఓట్లేసే యంత్రాలుగానే చూడటం శోచనీయం. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఇప్పటివరకు కులగణన వైపుగా ఒక్క అడుగు కూడా వేయలేదు. అత్యంత వెనుకబడిన కులాలకు మంత్రిత్వశాఖను ఏర్పాటు చేస్తామన్న హామీని కూడా నెరవేర్చలేదు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఇస్తామన్న రూ.10 లక్షల రుణాలపై కార్యాచరణ రూపొందించ చలేదు. స్థానిక సంస్థలతో పాటు ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుకాలేదు. వీటన్నింటిని అమలు చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో కాంగ్రెస్ సర్కార్ ఉన్నది. ఈ మోసాన్ని ఇప్పటికైనా ప్రజలు గ్రహించాలి. బీసీలు తమ వాటా కోసం పోరు జెండా ఎత్తాలె. లేకపోతే ఆత్మవంచనకు గురవడం ఖాయం.

- బారి అశోక్ యాదవ్
95810 72140

అహంకారం వల్లే!

ప్రజాస్వామ్యంలోనూ రామరాజ్యం విధానాన్ని చూడండి. రాముడిని పూజించిన పార్టీ, ఆ పార్టీ నాయకులు క్రమంగా అహంకార పూరితులుగా మారిపోయారు. అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ నాయకుల అహంకారం వల్ల ఆ పార్టీకి ఇవ్వాల్సిన ఓట్లను, అధికారాన్ని దేవుడు ఆపేశాడు. రాముడి వ్యతిరేకులందరూ పకమైనప్పటికీ రెండో స్థానంలోనే నిలిచిపోయారు. దేవుడి తీర్పు వాస్తవమైనది.

- ఇంద్రేశ్ కుమార్, ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యనిర్వాహక సభ్యుడు

ఎటమటం

ఈ సలహాదారులున్నారే!

'ఈ పెద్దోళ్లున్నారే' అనే నువ్వు నేను సినిమా డైలాగ్ ఇప్పుడు ఆంధ్రలో స్వల్ప మార్పుతో తెగ వాడేస్తున్నారు. ఏపీలో వైసీపీ ఓటమికి ప్రభుత్వ సలహాదారులే కారణమంటూ, 'ఈ సలహాదారులున్నారే' అనే విసుర్లు వెల్లువెత్తుతున్నాయి. జగన్‌ను ఎవరూ కలువకుండా సలహాదారులు దూరంగా పెడితే, ప్రజలేమో ఆయన్ని ప్రభుత్వానికి దూరంగా పెట్టారని సెటైర్లు విసురుతున్నారు. సలహాదారులేమో 'ఆయన కలుస్తానంటే మేం ఏమైనా అడ్డుపడ్డామా?' అని నసుగుతున్నారట.

బోకేకు డబ్బులు దండుగ

బోకేలు ఇవ్వడం కంటే మరేదైనా తీసుకరండని అప్పుడప్పుడు కొందరు నాయకులు అనడం విన్నాం. బోకేలకు డబ్బులు దండుగన్నది వారి అభిప్రాయం అయి ఉండవచ్చు కాబోలు. ఈ సూత్రాన్ని బీజేపీ నాయకులు మాత్రం అక్షరాల పాటిస్తున్నారు. చంద్రబాబు పదవీ స్వీకార కార్యక్రమానికి వచ